

మత సామరస్యానికి ప్రతీక 'గంధం'
మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు గంధపు మహోత్సవం నిర్వహిస్తారని మంత్రి రోజా తెలిపారు. - 8లో



'రాయల' రాజసం!
పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె వద్ద బలిజ సంఘం వారు రాయల వారి కూడలి ఏర్పాటు చేశారు. - 8లో



టీడీపీ నేతల శవ రాజకీయం
గుండెపోటుతో కార్యకర్త మరణిస్తే టీడీపీ నేతలు క్షుద్ర రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాకు 25 కేవీ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు 100 వచ్చినట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 48 కిలోమీటర్లు కేబుల్స్, 90 కిలోమీటర్ల కండక్టర్లు కూడా చేరినట్లు వెల్లడించారు. అన్ని పరికరాలను జిల్లా స్టోర్‌లో నిల్వ చేసినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకం



అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో రాహుకాల అభిషేకం నిర్వహించారు. తొలుత వేకువనే ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప, పూల తోరణాలతో అలంకరించారు. అనంతరం రాహుకాల సమయంలో అమ్మవారికి విశేషాభిషేకం జరిపించారు. భక్తులు, ఉభయకర్తలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి, సభ్యుడు రాజేష్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాల వితరణ చేపట్టారు. అన్నదానానికి కూరగాయలను విరాళంగా అందించిన దాత సీఎస్ నవీన్‌కుమార్ మిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ జిల్లా జట్ల ఎంపిక రేపు

రొంపిచెర్ల : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం వాలీబాల్ జిల్లా జట్లు ఎంపిక చేయనున్నట్లు రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్ మెంట్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అశ్విందర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అండర్-16, 19తోపాటు సీనియర్స్ విభాగంలో జట్లను ఎంపిక చేపడుతామని వివరించారు. ఇతర సమాచారం కోసం 9505154159 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


పకడ్బందీగా 'సురక్ష-2' క్యాంపులు



కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష-2 క్యాంపులను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం క్యాంపులను నిర్వహిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రజలకు అవసరమైన వైద్యసేవలతో పాటు 7 రకాల పరీక్షలు, 92 రకాల మందులు అందిస్తున్నామని వెల్లడించారు. కాన్ఫరెన్స్‌లో ఆరోగ్య శ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్, డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

పీసీఆర్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాస రచనలో మొదటి స్థానం హేమ (బంగారుపాళ్యం), రెండో స్థానం నవ్యశ్రీ (శాంతిపురం), మూడో స్థానంలో గుణశ్రీ (జీడీనెల్లూరు) నిలిచారు. విజేతలను డీఈఓ విజయేంద్రరావు, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, రమేష్ బాబు, ప్రసాద్ అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి 'బీమా'

చిత్తూరు కలెక్టరేట్ : కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తోందని జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి కార్మికుడూ రూ.110లు చొప్పున చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు వలంటీర్లతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ఇన్సూరెన్స్ ద్వారా చేకూరే లబ్ధిని కార్మికులకు వివరించాలని కోరారు.

వెంకటగిరి కోటలో జైత్రయాత్ర



రాపూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనం

ఒకపక్క కుట్రపూరిత రాజకీయాలు.. మరో పక్క పచ్చ పత్రికల విషపు రాతలు.. ఇంకో వైపు కొన్ని ఏడుపుగొట్టు టీవీ చానళ్ల కక్ష సాధింపులు.. ఇవేవీ సీఎం జగన్‌పై ప్రజలకున్న అభిమానాన్ని ఇసుమంతైనా తగ్గించలేకపోయాయి. గుండెల నిండా సమరోత్సాహాన్ని నింపుకొని, కంఠాలను జైగంటలుగా మోగిస్తూ, వెంకటగిరి పురవీధుల్లో కవాతు చేస్తూ ముందుకు కదిలింది జగన్ సైన్యం. సంక్షేమ సారథి సీఎం జగనన్నకు సెల్యూట్ చేస్తూ.. జైజగన్ జైజై జగన్ నినాదాలు హోరెత్తించింది. వెంకటగిరి పట్టణంతో పాటు, దక్కిలి, రాపూరు జనసంద్రమైంది. సాధికార బస్సు యాత్రకు నీరాజనాలు పట్టింది.

- సాధికార బస్సు యాత్రకు నీరాజనం
- జన సంద్రమైన వెంకటగిరి
- రాపూరు సభలో ఇసుకేస్తే రాలనంత జనం
- డక్కిలి బస్టాండ్‌లో నేతల ప్రసంగం
- మళ్లీ జగనే సీఎం కావాలంటూ హోరెత్తిన నినాదాలు

సైదాపురం/రాపూరు: వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయమైంది. వెంకటగిరి పట్టణానికి తండోపతండాలుగా జనం తరలిరావడంతో మరో జాతరను గుర్తుచేసింది. ముందుగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బంగ్లా వద్ద చేనేత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. పలు తీర్మానాలను కూడా ఆమోదించారు. బంగ్లా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోలేరమ్మ ఆలయం మీదుగా ర్యాలీ సాగింది. బాణసంచా పేలుళ్లతో వెంకటగిరి పట్టణం దద్దరిల్లింది. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రాల స్వారీ ర్యాలీ ఆకట్టుకుంది. పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి కాంపౌండ్ మీదుగా డక్కిలి, రాపూరుకు బస్సు యాత్ర చేరుకుంది. తిరుపతి ఎంపీ గురుమూర్తి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నటుడు, వైఎస్సార్‌సీపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, పోతుల సునీత, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జునయాదవ్, దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేంద్ర, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి డక్కిలి, రాపూరులో క్రేన్ల సహాయంతో గజమాలలు వేసి ఆత్మీయంగా సాగతం పలికారు. 20 కిలోమీటర్ల వరకు సాగిన బస్సు యాత్రకు పూల వర్షం కురిపించారు.



సమరయోధుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి



కదిలొచ్చిన మహిళా లోకం

బస్సు యాత్రకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టుకుని ఉత్సాహంగా తరలివచ్చారు. వెంకటగిరి నుంచి రాపూరు వరకు రహదారుల్లో ఇసుక వేస్తే రాలనంతగా జనం నిండిపోయారు.

ఆలోచింపజేసిన ప్రసంగాలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి కోసం నాలుగున్నరేళ్లగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నేతలు పూసగుచ్చినట్టు వివరించారు. చంద్రబాబు, వైఎస్ జగన్ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విశదీకరించగా.. జనం చప్పట్లు కొడుతూ జగన్‌కు జేజేలు పలికారు. రోషాల గడ్డ రాపూరు అనగానే చప్పట్లు మార్మోగాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు వంగపండు ఉషా బృందం సంక్షేమం, అభివృద్ధిపై పాటలు పాడి జనాన్ని మెప్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడా జానకిరామయ్య, నేతలు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, బాలయ్య, బత్తిన పట్టాభిరామిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, వైఎస్సార్సీపీ నేత పాపకన్ను మధుసూదన్ రెడ్డి, సైదాపురం మండల కన్వీనర్ రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ప్రసాద్ రెడ్డి, నారాయణరెడ్డి, రాపూరు మండల కన్వీనర్ దయాకర్ రెడ్డి, ఏపీపీ చైర్మన్ రవీంద్ర రెడ్డి, తోట గణేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్తీక్ రెడ్డి అన్ని మండలాల కన్వీనర్లు, జేసీఎస్‌లు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మనసున్నమహరాజు సీఎం జగన్



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

డక్కిలి: మనసున్న మహరాజు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సామాజిక సాధికారక బస్సుయాత్రలో భాగంగా ఆయన డక్కిలిలో మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా ఉండే నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.

ఆశీర్వదించండి.. రికార్డు సృష్టించండి

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి 175కు 175 స్థానాలు వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, సినీ నటుడు అలీ సూచించారు. సాధికార బస్సు యాత్రలో భాగంగా ఆయన డక్కిలిలోని దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటర్, కమ్మపల్లి రోడ్డు సెంటర్‌లో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్దన్‌రెడఇడ సినీ ఇండస్ట్రీకి ఎంతో మేలు చేశారని కొనియాడారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో ఏ రోజైన సకాలంలో వర్షాలు కురిశాయా అని ప్రశ్నించారు. నెల్లూరు నగర్ మేయర్ స్రవంతి మట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగనన్న రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు.



సాంస్కృతిక నీరాజనం



ఎత్తర జెండా..ఇదే మన ఎజెండా! దక్కిలి కూడలిలో సాధికార బస్సు యాత్రలో పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు



పోలేరమ్మ ఆశీస్సులు అందుకుని ర్యాలీగా బయలుదేరిన నేతలు



మళ్లీ రావాలి జగన్

పండుగలా 'పింఛన్ కానుక'

వెదురుకుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్‌ను రూ.3వేలకు పెంచారని, దీన జన బాంధవుడిగా నిలిచారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కొనియాడారు. శుక్రవారం వెదురుకుప్పంలో నిర్వహించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అవ్వాతాతలకు మనవడిగా, డ్వాక్రా మహిళలకు తోబుట్టువుగా, రైతులకు అండగా, పేదలకు ఆపద్బాంధవుగా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ పొందేందుకు ప్రజలు నానా అవస్థలు పడేవారని, ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్లు నగదు అందిస్తున్నారని వెల్లడించారు. పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపట్టడం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం ఐటీఐ కళాశాలకు భూములు ఇచ్చిన 19 మంది రైతులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు, కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు శిల్ప, భువనేశ్వరి, గోవిందయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మునీంద్రారెడ్డి, భాస్కర్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పెన్షన్ పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మాంబేడులో విలేజ్ క్లినిక్

మండలంలోని మాంబేడులో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ డాక్టర్ సేవలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచిన ప్రజానాయకుడు జగనన్న అని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు, వైద్యాధికారి సురేఖ, ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం

రామకుప్పం : పండుగలా శుక్రవారం రామకుప్పంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మురళీకృష్ణ అధ్యక్షత వహించిన సభలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో సైతం వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. పింఛన్లను రూ.3వేల పెంచి లక్షలాది మందికి భరోసా కల్పించారని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ బాబును ప్రజలు నమ్మరని తెలిపారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు రెడ్డెప్ప, మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

అర్హులందరికీ 'సంక్షేమం'

- జిల్లాలో 2,065 మందికి లబ్ధి
- వివిధ పథకాల కింద రూ.3.13 కోట్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాగా సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. శుక్రవారం తాడేపల్లె క్యాంప్ కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వైవార్షిక సంక్షేమ పథకం కింద లబ్ధిదారులకు వర్చువల్ విధానంలో నగదు పంపిణీ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీ రెడ్డెప్పతోపాటు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్ పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు పొందే అర్హత ఉన్నా పలు కారణాలతో లబ్ధి చేకూరని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ శ్రీనివాసులు

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సంక్షేమ పథకాల కింద మొత్తం 2,065 మంది ఖాతాల్లో రూ.3.13 కోట్లు జమ చేసినట్లు వివరించారు. అనంతరం మెగా చెక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, జెడ్పీ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ భారతి, డీఆర్‌డీఏ పీడీ తులసి, సంక్షేమ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, విజయేంద్రరావ్, రవికుమార్ పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



నా భర్త పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. కొద్ది పాటి సంపాదనతో పిల్లల చదువు మాకు భారంగా ఉండేది. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం సాంకేతిక కారణాలతో మాకు రాలేదు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి పేదలకు మేలు చేకూర్చేందుకు ఇప్పుడు మాకు అమ్మఒడి లబ్ధి అందించడం ఆనందంగా ఉంది.

– కాజాముస్నీ, శంకరాయగుంట, చిత్తూరు

మేలు మరువలేం



గతంలో కొన్ని కారణాల వల్ల చేయూత పథకం పొందలేకపోయా. ఇటీవల ఈ పథకం కోసం మా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. ప్రస్తుతం చేయూత పథకానికి ఎంపికయ్యా. చాలా సంతోషంగా ఉంది. పేదరికంలో ఇబ్బందులు పడుతున్న మా కుటుంబానికి సీఎం జగనన్న చేసిన మేలు మరువలేం. చేయూత నగదు రూ.18,750తో చీరల వ్యాపారం చేసుకుంటా.

– సుమతి, శ్రీనగర్‌కాలనీ, చిత్తూరు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో విజయానందరెడ్డి

గుడిపాల: మండలంలోని పశుమంద, పశుమంద దళితవాడ, ఎస్టీ కాలనీకి చెందిన 40 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచులు రజనీకాంత్, మధుసూదన్ రాయల్ పాల్గొన్నారు.





● 'రాయల' రాజసం!



పుంగనూరులో ప్రారంభించనున్న శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం



ఆకట్టుకునేలా తీర్చిదిద్దిన శ్రీకృష్ణదేవరాయల సర్కిల్



విద్యుద్దీపాల వెలుగులో సర్కిల్



కూడలిలో ఏర్పాటు చేసిన ఏనుగు ప్రతిమ

పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె వద్ద శ్రీకృష్ణదేవరాయల వారు ఆదివారం కొలువుదీరుతున్నారు. రాయల రాజసం చాటేలా కూడలిని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో సిద్ధం చేసిన సర్కిల్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుమారు రూ.50లక్షల విలువైన స్థలం కేటాయించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తన వంతు విరాళంగా విగ్రహం అందించారు. నేతలు పోకల అశోక్‌కుమార్, కొండవీటి నాగభూషణం, నాన బాలగణేష్, పూల త్యాగరాజు నేతృత్వంలో కూడలి ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేపట్టారు. మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేతులమీదుగా సర్కిల్ ఆవిష్కరించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. సుమారు పదివేల మంది బలిజలను ప్రారంభోత్సవ సమావేశానికి తరలించేందుకు సన్నద్ధమవుతున్నారు. మహోత్సవానికి విచ్చేసేవారికి రవాణా, భోజన వసతులు సమకూర్చనున్నట్లు నిర్వాహకులు వెల్లడిస్తున్నారు.

– పుంగనూరు

రూ.10 లక్షల ఫర్నీచర్ వితరణ



ఫర్నీచర్‌తో ప్రధానోపాధ్యాయులు

పాలసముద్రం : బెంగళూరు పద్మావతి వెంకటేశ్వర్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ వారు శుక్రవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రూ.10 లక్షల విలువైన ఫర్నీచర్ అందజేశారు. వనదుర్గాపురం గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, సొసైటీ నిర్వాహకుడు బాబురాజు నేతృత్వంలో విశ్రాంత ఉపాధ్యాయుడు స్వామిరాజు 120 డెస్కులు, 65 టేబుళ్లు, 560 కుర్చీలు 10 ర్యాక్‌లు అందించారు. .

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

రొంపిచెర్ల: స్థానిక ముత్యాలమ్మ గుడి వీధిలో కరీముల్లా అనే వ్యక్తి ఇల్లు శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. వివరాలు.. కరీముల్లా తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్యాభర్తలు ఇరువురూ ఇంట్లో లేని సమయంలో మంటలు చెలరేగాయి. పిల్లలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై వారిని కాపాడారు. పీలేరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో దాచుకున్న 50 గ్రాముల బంగారు నగలు, రూ.లక్ష నగదు, గృహోపకరణాల కాలిపోయి నట్లు బాధితులు వెల్లడించారు. ప్రమాదంలో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లినట్లు వివరించారు.

ఇంటి వద్ద మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

పూతలపట్టు: అక్రమంగా ఇంట్లో మద్యం నిల్వ చేసుకుని విక్రయిస్తున్న మహిళలను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని యం.బండపల్లెకు చెందిన బి.శ్వేత తన ఇంట్లో మద్యం విక్రయాలు చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.



టీడీపీ నేతల శవ రాజకీయం

- గుండెపోటుతో మృతి చెందిన ఆ పార్టీ కార్యకర్త
- పెన్షన్ అందక మరణించినట్లు చిత్రీకరణ
- వాస్తవం వెల్లడించిన సచివాలయ సిబ్బంది



సర్దార్‌సాబ్ (ఫైల్)

శాంతిపురం : కాదేదీ రాజకీయానికి అనర్హమన్న చందంగా టీడీపీ అధినేత చంద్రబాబు వ్యవహరిస్తుంటారు. అదే బాటలో ఆ పార్టీ నాయకులు సైతం నడుస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి టీడీపీ శాంతిపురం మండలంలో క్షుద్ర రాజకీయానికి తెరతీసింది. వివరాలు.. శాంతిపురం మండలం చెంగుబళ్ల పంచాయతీ సోగడబళ్లకు చెందిన టీడీపీ కార్యకర్త సర్దార్ సాబ్(69) గురువారం చెంగుబళ్లలోని గ్రామ సచివాలయానికి ద్విచక్రవాహనంపై వెళుతూ అస్వస్థతకు గురయ్యాడు. ఆయాస పడుతూ వచ్చిన ఆయన పరిస్థితి గమనించి సచివాలయ సిబ్బంది సపర్యలు చేశారు. 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన తుది శ్వాస విడిచారు. వైద్యులు సైతం సర్దార్‌సాబ్ గుండె పోటుతో మృతి చెందినట్టు నిర్ధారించారు. మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ క్రమంలో స్థానిక వలంటీర్ మానవత్వంతో ఆలోచించి సర్దార్‌సాబ్ మృత దేహం వేలి ముద్ర తీసుకుని ఈ నెల పింఛన్‌ను ఆయన కుటుంబీకులకు అందించాడు. అయితే శుక్రవారం ఉదయం టీడీపీ నేత, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆ పార్టీ నాయకులు మృతదేహాన్ని సందర్శించారు. పింఛన్ రద్దు చేయడం వల్లే మనస్తాపంతో సర్దార్‌సాబ్ మరణించాడని, ఘటనకు రాజకీయ రంగు పులిమేశారు. ఈ మేరకు మృతుడి కుమారుడు బుజ్జుతో అసత్య ఆరోపణలు చేయించారు. ఎప్పుడూ దర్జాగా తిరిగే సర్దార్‌సాబ్ కేవలం పింఛన్ సొమ్ము కోసం ప్రాణాల మీదకు తెచ్చుకునేవాడు కాదని, అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని సోగడబళ్ల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే ఆస్పత్రికి తరలించాం



సోగడబళ్ల సర్దార్ సాబ్ మా సచివాలయంలో అందరికీ సుపరిచితుడే. ఏదో ఒక పని మీద వారంలో రెండు మూడు సార్లు సచివాలయానికి వస్తుండేవాడు. గురువారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో నీరసంగా, చెమటలు కక్కుతూ వచ్చాడు. ఎందుకు అలా ఉన్నారని అడిగితే గ్యాస్టిక్ సమస్యని చెప్పి నీరు తీసుకుని తన జేబులోని మాత్రలు వేసుకున్నాడు. తర్వాత తేరుకోకపోవడంతో వెంటనే 108కు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించాం.

– వినయ్, అగ్రికల్చర్ అసిస్టెంట్, చెంగుబళ్ల

నిందలు వేస్తున్నారు



సచివాలయానికి వచ్చిన ప్రతిసారీ అందరితో కలుపుగోలుగా మాట్లాడే సర్దార్ సాబ్ గురువారం సాయంత్రం నీరసంగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. పలకరిస్తే తప్ప ఎవరితోనూ మాట్లాడలేదు. నీరు తీసుకుని తనతో తెచ్చుకున్న మాత్రలు వేసుకున్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో కలిసి ఆయనకు సపర్యలు చేశా. నిమిషాల వ్యవధిలోనే వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నాపై కూడా వాంతి చేసుకున్నాడు. అంతలో 108 సిబ్బంది వచ్చి సర్దార్ సాబ్ గుండె పోటుకు గురయ్యారని తెలిపారు. వెంటనే ఆస్పత్రికి తరలించారు.

– ఉదయ్, వెల్ఫేర్ అసిస్టెంట్, చెంగుబళ్ల

ఓర్వలేక విషం కక్కుతున్నారు

కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేకే టీడీపీ నేతలు విషం కక్కుతున్నారు. టీడీపీ కార్యకర్త సర్దార్‌సాబ్ గుండెపోటుతో మరణిస్తే, ఆయన కుటుంబీకులను ప్రలోభపెట్టి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆ పార్టీ నేతలు సంకుచితంగా మాట్లాడుతున్నారు. గ్రామాల్లో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. సాంకేతిక కారణాలతో గురువారం సాయంత్రం వరకు ఫించన్ల పంపిణీ గురువారం ప్రారంభించారు. ఇదే అదనుగా అసత్య ఆరోపణలతో టీడీపీ నేతలు క్షుద్రమైన ఆలోచనలతో మాట్లాడుతున్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారు.

– వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి

మత సామరస్యానికి ప్రతీక 'గంధం'



గంధపు మహోత్సవంలో మంత్రి రోజా

పుత్తూరు: మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు పవిత్రంగా గంధపు మహోత్సవం నిర్వహిస్తారని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక గేట్‌పుత్తూరులోని నాగూర్ ఖాదర్‌వలీ దర్గాలో చేపట్టిన గంధపు మహోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ముస్లింలు, హిందువులు సమష్టిగా జరుపుకుంటారని వెల్లడించారు. అలాగే వినాయక చవితి వేడుకల్లో ముస్లింలు సైతం భాగస్వాములు కావడం మన రాష్ట్ర ప్రత్యేకతని వివరించారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ ఉన్నారు.

టీడీపీ నేతకు మహిళ ఝలక్!



టీడీపీ నేత థామస్‌తో మాట్లాడుతున్న మహిళ

గంగాధర నెల్లూరు : మండలంలోని వీరకనెల్లూరు గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి థామస్‌కు శుక్రవారం ఓ మహిళ ఝలక్ ఇచ్చారు. బాబుతో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా థామస్ ఇంటింటి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా వీరకనెల్లూరు దళితవాడకి చెందిన మహిళను రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేయమని కోరారు. దీనిపై స్పందించిన సదరు మహిళ దశాబ్దాలుగా టీడీపీకే ఓటు వేశామని, ఒక్క రేషన్ కార్డు గానీ, ఇంటి పట్టాగాని ఇవ్వలేదన్నారు. జన్మభూమి కమిటీల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కులం, మతం, పార్టీ చూడకుండా అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వెల్లడించారు. తనకు సైతం రూ.1.80లక్షల ఇల్లు మంజూరు చేశారని సంతోషం వ్యక్తం చేశారు. అమ్మ ఒడి, రైతు భరోసా, వైయస్సార్ ఆసరా పథకాలు ఇంటికే వచ్చాయని, రాబోయే ఎన్నికల్లో సీఎం జగనన్నే మళ్లీ గెలవాలని, ఆయనే ముఖ్యమంత్రి కావాలని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశారు. దీంతో కంగుతిన్న థామస్ చల్లగా అక్కడ నుంచి జారుకున్నారు.

వైభవంగా సంకీర్తన మహోత్సవం



కీర్తనలు ఆలపిస్తున్న నాయీ బ్రాహ్మణులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలోని ఆస్థాన మండపంలో నాయీ బ్రాహ్మణ సంఘం వారు శుక్రవారం వైభవంగా త్యాగరాజ సంకీర్తన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, నాదస్వరం విద్వాన్ సత్యనారాయణ, కాణిపాకం నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు వరదరాజులు పాల్గొన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

పలమనేరు : ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ మాయమైందని, సీసీ ఫుటేజీని పరిశీలిస్తే తన భర్తకు బంధువైన కిరణ్ తీసుకెళుతున్నట్లు తెలిసిందని రూప అనే మహిళ ఆరోపించింది. శుక్రవారం ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో తన పేరిట ఉన్న కారును సైతం భర్త వెంకటేష్ తీసుకెళ్లి మాయం చేశాడని, అదే రీతిలో ఇప్పుడు బైక్ అపహరించారని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు వెంటనే తన భర్తతో పాటు కిరణ్‌ను విచారించి న్యాయం చేయాలని కోరింది.

కొడుకు మరణం తాళలేక తల్లి మృతి

చిత్తూరు అర్బన్: కొడుకు మరణంతో మనోవేదనకు గురై తల్లికి కూడా అనంతాలోకాలకు వెళ్లిపోయింది. ఈ ఘటన శుక్రవారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కట్టమంచికి చెందిన సురేంద్రరెడ్డి(58) ఓ ద్విచక్రవాహన షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం హోటల్లో భోజనం తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన చూసిన సురేంద్రరెడ్డి తల్లి సుశీలమ్మ(83) కూడా అక్కడిక్కడికే కుప్పకూలిపోయారు. ఆమెను చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు.

దర్యాప్తు ముమ్మరం

చంద్రగిరి: బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.ఎం.కొంగరవారిపల్లి జగనన్న కాలనీలో ఝార్ఖండ్‌కు చెందిన రాజేష్‌నాయక్ ఆరేళ్ల కుమార్తె మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్ : నగరంలోని కట్టమంచి వద్ద శుక్రవారం కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కయనికట్టు మురళి అనే వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భారతి తెలిపారు.